RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260


ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 293 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

శనివారం 29 జూన్ 2024

# పోలవరం విధ్వంసంతో

# రాష్ట్రానికి జగన్ ద్రోహం!




**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:**
పోలవరం విధ్వంసంతో జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. జగన్ మూర?త్వం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని...డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం జగన్ కు కూడా రెండేళ్ల తర్వాత తెలిసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో పోలవరం ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు దుస్థితిపై వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లో శ్వేతపత్రం విడుదల చేశారు. దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...

**-ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు శ్వేతపత్రం విడుదల.**
**-ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

-జగన్ అసమర్థత, వల్ల ప్రాజెక్టు మనుగడే ప్రమాదంలో పడింది.

-ఏజెన్సీలను మార్చొద్దని పీపీఏ చేసిన హెచ్చరికలను సైతం పెడచెవిన పెట్టారు.

-ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను సైతం దారిమళ్లించారు.

-వాస్తవాలు దాచి పెట్టి పోలవరం పూర్తి చేస్తాం అంటూ తప్పుడు ప్రకటనలు చేశారు.

టీడీపీ హయాంలో 72 శాతం పనులు పూర్తైతే...వైసీపీ ప్రభుత్వం చేసింది కేవలం 3.84 శాతం మాత్రమే.

-పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లే అంటూ కొత్త ప్రతిపాదనలు తెచ్చారు.

-పోలవరం ప్రాజెక్టు దుస్థితిని చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది.

## ఉద్యోగులకు శుభవార్త..

## నెల జీతం బోనస్.!

**-ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది.**

**-అకౌంట్లలో జీతంతో పాటు అదనంగా ఒక నెల గౌరవ వేతనం కూడా పడనుంది.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:
ఆంధ్రప్రదేశ్?లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల పలువురు ఉద్యోగుల అకౌంట్లలోకి జీతంతో పాటు అదనంగా ఒక నెల గౌరవ వేతనం కూడా పడనుంది. ఇంతకీ ఆ ఉద్యోగులు ఎవరో ఇప్పుడు చూద్దాం.
ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బందికి ఒక నెల అదనపు వేతనం ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర సీఈవో ముఖేష్ ?కుమార్? మీనా అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల విధులు నిర్వర్తించిన వారికి చేసే వేతనాల చెల్లింపులు క్యాడర్?ను బట్టి ఏపీ ఎన్నికల అధికారి నిర్ణయిస్తారు. ఎన్నికల విధులు నిర్వహించిన డీఈవోలు, ఆర్వోలు, ఏఆర్వో, ఎన్నికల సిబ్బందికి ఒక నెల గ్రాస్ శాలరీకి తక్కువ కాకుండా అందుకు సమానంగా బోనస్? చెల్లించే అవకాశాలున్నాయి.

## జగన్‌కు ప్రతిపక్ష హోదా ఏ పరిస్థితిలోనూ రాదు.!

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:
ఐదేళ్లుగా పరదాల మాటున పాలన చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత జగన్ అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శాసనసభ నియమాలు పాటించని వ్యక్తి, ప్రతిపక్ష హోదా కావాలని జగన్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా జగన్‌కు ఏ పరిస్థితిలోనూ రాదన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో వైఎస్సార్సీపీ కార్యాలయాలు కట్టుకోవడం దారుణం అని మండిపడ్డారు.
జగన్మోహన్ రెడ్డి ఎప్పుడు శాసనసభ నియమాలే పాటించలేదు. జగన్మోహన్ రెడ్డి సలహాదారులు రాజ్యాంగం, చట్టాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన మండిపడ్డారు. వైఎస్సార్? కాంగ్రెస్? పార్టీ కార్యాలయాల కోసం నియమాలు ఉల్లంఘించి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 28 ప్యాలెస్?లు కట్టుకున్న వ్యక్తి అని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ఆఫీసులు ప్రభుత్వ నిబంధన ప్రకారమే కట్టుకుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## మాజీ సీఎస్ కు మళ్లీ పోస్టింగ్..

## రాష్ట్ర ప్రభుత్వ ఔదార్యం. !

**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:**
వైకాపా ప్రభుత్వంలో కీలక హోదాల్లో వివాదాస్పదంగా పనిచేసి, ఈ నెలాఖరులో పదవీవిరమణ చేయనున్న ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులకు రిటైర్మెంట్ ముంగిట పోస్టింగులు ఇచ్చి కూటమి ప్రభుత్వం హుందాగా వ్యవహరించింది. వారిలో ఒకరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కాగా, మరొకరు పూనం మాలకొండయ్య.



గత ప్రభుత్వంలో సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి.. నాటి అధికార పార్టీ పెద్దలతో అంటకాగడంతో పాటు ఎన్నికల్లో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు మూటగట్టుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలకు ప్రయోజనం చేకూర్చడం కోసం తీవ్రంగా శ్రమించారు. పింఛన్ల కోసం వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కూడా మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిరిగి ఇబ్బంది పడేలా చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పోస్టింగ్ విషయంలో కూడా రిటైర్మెంట్ ముందు అమానవీయంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించగా ఆయన కోర్టుకు వెళ్లి పోస్టింగ్‌కు అనుమతి పొందాల్సి వచ్చింది. ఇలాంటి వివాదాస్పద చర్యల కారణంగా ఎన్నికల ఫలితాల అనంతరం జవహర్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టినా.. ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పోస్టింగ్ ఇచ్చి హుందాగా వ్యవహరించింది. పోస్టింగ్ లేకపోతే అవమానకరంగా పదవీవిరమణ చేయాల్సి వచ్చేది. దీంతో ఆయనను ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనకబడిన వర్గాలు) సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న అనంత రామును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిరీక్షణలో ఉన్న పూనం మాలకొండయ్యను సాధారణ పరిపాలన శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పోలా భాస్కర్‌ను అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ కావాలని ఆదేశించారు. పూనం మాలకొండయ్య వైకాపా హయాంలో నాటి సీఎం జగన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆమె కూడా ఈ నెలాఖరులో రిటైర్ కానున్నారు. ఇటీవల కేంద్ర సర్వీసునుంచి ఏపీ కేడర్‌కు వచ్చిన పీయూష్ కుమార్‌ను సీఎంకు ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ఆర్థికశాఖ (పీఎఫ్ఎస్) ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఎస్ రావత్ సెలవులో ఉన్నారు. ఆయన్ను రిలీవ్ చేయాలని ఆదేశించారు.

## జగన్ ను గెలిపించిన రెడ్లే..

## వైసీపీని ఓడించారా..!



2లో

## తిరుమలలో పెద్దిరెడ్డి అక్రమాలు..

**54 మందికి విఐపి బ్రేక్ దర్శనం.!**




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:
గత ప్రభుత్వంలో మంత్రులు, అధికార పార్టీ నేతలు తిరుమలను తమ అడ్డాగా చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలను నిజం చేస్తూ వీరు చేసిన అక్రమాలు ఇపుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.గత ప్రభుత్వం తితిదే పవిత్రతను ఉద్దేశ్యపూర్వకంగా దెబ్బతీసిందని భక్తలు ఆరోపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనికితోడు, వైకాపా మంత్రులు ఇష్టానుసారంగా సిఫార్సు లేఖలతో అనేక మందిని వీఐపీ బ్రేక్ దర్శనానికి పంపించారు. ముఖ్యంగా, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన మంత్రులు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తించినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒకే లేఖపై ఏకంగా 54 మందికి దర్శనం కల్పించాకరు. దీనికి సంబంధించిన లేఖ ఒకటి ఇపుడు వెలుగులోకి వచ్చింది. తాను పంపిన వారిని దర్శనానికి అనుమతించాలంటూ అప్పటి తితిదే ఈవో ధర్మారెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి రాసిన సిఫార్సు లేఖను తెలుగుదేశం పార్టీ తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసింది.తిరుమలలో వైకాపా పెద్దలు యధేచ్ఛగా దందాలు చేశారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వీఐపీ బ్రేక్ దర్శనం పేరుతో పెద్దిరెడ్డి ఒకేసారి 54 మందిని పంపించాలని రాసిన సిఫార్సు లేఖ ఇదేనని పేర్కొంది. ఈ బ్రేక్ దర్శనం స్కాంతో పాటు శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్ కుంభకోణంపైనా తితిదే విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం మంత్రి పెద్దిరెడ్డి రాసిన సిఫార్సు లేఖ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది.

# పోలవరం విధ్వంసంతో రాష్ట్రానికి జగన్ ద్రోహం .!

."సీఎంగా ప్రమాణస్వీకారం చేశాక పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. వైసీపీ 5 ఏళ్ల విధ్వంసంతో రాష్ట్రం ఎలా నష్టపోయిందో కూలంకుశంగా ప్రజల్లో చర్చజరగాలి. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారు. ఫోర్త్ ఎస్టేట్ కూడా గత ప్రభుత్వానికి భయపడింది. కోర్టులను కూడా బ్లాక్ మెయిల్ చేసి జడ్జిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. రాష్ట్ర పునర్నిర్మాణం జరగడానికి మేమంతా కష్టపడి పని చేస్తాం. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలవాలి అని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ప్రజలు గెలిచి...చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. ఇక రాష్ట్రాన్ని నిలబెట్టడంలో అందరూ భాగమైతే దానికి మేము బాధ్యత తీసుకుంటాం. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న వాటిలో 7 ప్రధాన అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెట్టే ముందు మన సమస్యలు కూడా కేంద్రం ముందు ఉంచాలి. అందుకే 25 రోజుల్లోనే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేసి తర్వాత రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతాం. ఇరిగేషన్ సంబంధించి ఒక వెబ్ సైట్ ప్రారంభించి అందులో అన్ని అంశాలను ఉంచుతాం. చెప్పిన తప్పులనే వందసార్లు చెప్పి ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారు...దానికి వాస్తవాలతో చెక్ పెడతాం. అవాస్తవాలన్నింటికీ ప్రజలే బుద్ధి చెప్పేలా వాస్తవాలు ప్రజల ముందు ఉంచుతాం. రాష్ట్రానికి సాగునీటి ప్రాజెక్టుల అవసరం ఎంతో ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే టీడీపీ హయాంలో రూ.67 వేల కోట్లు ఇరిగేషన్ పై ఖర్చు చేశాం. కనీసం గత ప్రభుత్వం వాటి నిర్వహణకు కూడా నిధులు ఇవ్వలేదు." అని సీఎం చంద్రబాబు అన్నారు.

"రాష్ట్రానికి రెండు ప్రధానమైన ప్రాజెక్టుల్లో ఒకటి పోలవరం...రెండు అమరావతి. ఆ రెండూ రాష్ట్రానికి రెండు కళ్లులాంటివి. అవి పూర్తి చేసుకుంటే రాష్ట్రానికి ఉన్న నష్టాన్ని పూడ్చుకోవచ్చు. జగన్ పోలవరానికి ఒక శాపంగా మారారు. జగన్ చేసిన నేరం క్షమించరానిది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా జగన్ ను అందరూ నిలదీయాలి. రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. దక్షణ భారతదేశంలో అత్యధిక నీళ్లు ఉండే ఏకైక నది గోదావరి. యేటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోంది. వీటిని వినియోగించుకుంటే రాష్ట్రంలో కరవు అనేది ఉండదు. పోలవరంలో ముంపునకు గురయ్యే 7 మండలాలు నాడు తెలంగాణలో ఉన్నాయి...అవి ఏపీలో కలిపితేనే ప్రమాణస్వీకారం చేస్తానని చెప్పడంతో మొదటి కేబినెట్ సమావేశంలోనే ఏపీలో కలుపుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఉత్తరాంధ్ర, రాయలసీమకు తాగు, సాగు నీరు అందించే బహుళార్ధక సాధక ప్రాజెక్టు. 2014లో విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే 2019 నుండి 2024 మధ్య జరిగిన నష్టమే ఎక్కువ. పోలవరం ద్వారా 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు... 23.50 లక్షల ఎకరాలు స్థిరీకరించవచ్చు. పరిశ్రమలకు సమృద్ధిగా నీరందించవచ్చు. టీడీపీ హయాంలో ఒకే రోజున 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసి గిన్నిస్ రికార్డ్ సృష్టించాం. నేను 31 సార్లు క్షేత్రస్థాయిలో పోలవరంలో పర్యటించాను. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయానికి ఊతం వస్తుందనే శ్రద్ధ పెట్టాను. ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ క్లియర్ చేశాను. పోలవరం ప్రాజెక్టుకు టీడీపీ హయాంలో రూ.11, 762.47 కోట్లు ఖర్చు చేస్తే...వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ చేతకానితనం, అహంభావం వల్లే ప్రాజెక్టు దెబ్బతింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజే ప్రాజెక్టు పనులు నిలిపేశారు. ప్రాజెక్టు పరిస్థితి ఏంటో చూడకుండా పనులు నిలిపేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే పని చేసే ఏజన్సీలను తొలగించారు. 2019 జూన్ నుండి నవంబర్ వరకు ప్రాజెక్టుకు ఏజన్సీ లేదు. వరదలతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిందని రెండేళ్ల తర్వాత కనుక్కున్నారు. టీడీపీ హయాంలో ఉన్న కాంట్రాక్టరు పనితీరు సంతృప్తికరంగానే ఉంది..మార్చాల్సిన పనిలేదని పీపీఏ తమ మినిట్స్ లో పేర్కొంది. 2009లో కాంట్రాక్టరును మార్చడం వల్ల హెడ్ వర్క్స్ పనులు నిలిచిపోయాయి...కాంట్రాక్టర్ ను మార్చితే జాప్యం జరుగుతుందని పీపీఏ హెచ్చరించింది. కొత్తకాంట్రాక్టరను మార్చడం వల్ల పనుల్లో జాప్యం జరిగిందని పీపీఏ తెలిపింది. ఒకే పనిని రెండు ఏజన్సీలు చేస్తే నాణ్యత దెబ్బతింటుదని చెప్పినా వినలేదు. కాంట్రాక్టర్ ను మార్చడం, ముందు చూపు లేకపోవడంతో పనులు తీవ్ర జాప్యం అవుతాయని కేంద్ర ఇరిగేషన్ సెక్రటరీకి పీపీఏ లేఖ కూడా రాసింది. మేము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదు..కానీ జగన్ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్నారు. తనకు అన్నీ తెలుసు అన్నట్లుగా వ్యవహరించారు." అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు."పోలవరం ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలను ఎత్తిచూపేందుకు నీతి ఆయోగ్ నియమించిన నిపుణుల కమిటీ కూడా ప్రభుత్వ అసమర్థ ప్రణాళికతోనే డయాఫ్రం వాల్ దెబ్బతిందని నివేదిక ఇచ్చింది. డయాఫ్రం వాల్, ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. 2018లో రూ.436 కోట్లతో డయాఫ్రం వాల్ పూర్తి చేశాం...కానీ గత ప్రభుత్వ నిర్వాకంతో డ్యామేజ్ అయిన పనులకే ఇప్పుడు రూ.447 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు చెప్పిన దాన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది..దానికి కూడా మూడు నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు అంటున్నారు. జగన్ మూర?త్వంతో చేసిన పనికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. జగన్ విధ్వంసంతో ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులే మారిపోయాయి. ఎగువ కాఫర్ డ్యాం నుండి వచ్చిన వరద ఉధృతికి గ్యాప్ %-% 1 వద్ద 150 మీటర్ల గట్టు కొట్టుకుపోయింది. జగన్ నిర్లక్ష్యం, విధ్వంసంతో ప్రాజెక్టుకు సహజ సిద్ధంగా లభించేవి కూడా ప్రమాదంగా మారి ప్రాజెక్టు స్థితినే మార్చేశాయి. గైడ్ బండ్ కుంగిపోయింది. నేరుగా నీళ్లు వస్తే ప్రజర్ తగ్గుతుందని గైడ్ బండ్ ను రూ.80 కోట్లతో నిర్మించాం. డయాఫ్రం వాల్, ఎగువ-దిగువ కాపర్ డ్యాం, గైడ్ బండ్ ఈ మూడు డ్యామేజీలు జగన్ నిర్వాకం వల్లే జరిగినవే...వాటి వల్ల ప్రాజెక్టు పనులు, పవర్ హౌస్ ఆలస్యం అవుతున్నాయి. " అని సీఎం చంద్రబాబు వివరించారు.

"టీడీపీ ఐదేళ్లలో 72 శాతం పనులు పూర్తి చేస్తే...వైసీపీ 3.84 శాతం మాత్రమే పూర్తి చేసింది. దానికి తోడు నిధుల కొరత కూడా తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో రాష్ట్ర నిధులు ఖర్చు చేసి రీయింబర్స్ చేయించాం...వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ప్రాజెక్టు కోసం ఖర్చు చేయకుండా రూ.3,385 కోట్లు దారిమళ్లించింది. టీడీపీ హయాంలో వచ్చిన గిన్నిస్ రికార్డుకు కేంద్రం కూడా ప్రశంసలు కురిపిస్తే..వైసీపీ హయాంలో నిపుణులు, పీపీఏ చివాట్లు పెట్టే పరిస్థితికి తీసుకొచ్చారు. 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే...వైసీపీ ప్రభుత్వం 41.15 మీటర్లకు కుదించింది. రూ.55,548 కోట్లకు కేంద్రంతో ఆమోదం తెలిపేలా మేము కృషి చేస్తే...గత ప్రభుత్వం అసలు నిధులు కూడా అడగలేదు. నిర్వాసితులకు జగన్ ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశాడు. పరిహారం ఎకరాకు రూ.19 లక్షలు ఇస్తానన్నారు. పరిహారం అందిన వారికి కూడా రూ.5 లక్షలు అదనంగా ఇస్తానన్నారు. పరిహారం ఇవ్వకపోవడమే కాకుండా నిర్వాసితుల జాబితాలు మార్చి పరిహారం కాజేశారు. సకల వసతులతో కాలనీలు నిర్మిస్తానని చెప్పి ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. అధికారం, ఓట్ల కోసం ఎన్ని అబద్ధాలు చెప్పాలో అన్నీ చెప్పాడు. పునరావాసానికి రూ.4,114 కోట్లు టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసి మోడల్ కాలనీలు నిర్మిస్తే...వైసీపీ ప్రభుత్వం రూ.1687 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

"పోలవరం ప్రాజెక్టు పూర్తిపై పూటకో మాట మాట్లాడారు. మొదటి సారి 2021 ఏప్రిల్ నాటికి, రెండో సారి 2021 డిసెంబర్ నాటికి, మూడో సారి 2022 ఏప్రిల్ నాటికి, నాలుగో సారి 2021 డిశంబర్ నాటికి..ఇక ఐదో సారి ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేం అని చేతులెత్తేశారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు ఇప్పుడు కేంద్రం అంతర్జాతీయ నిపుణులను ఆహ్వానించి ప్రాజెక్టు దుస్థితిపై అధ్యయనం చేయాల్సి వస్తోంది. హైడల్ ప్రాజెక్టు 2020 నాటికి పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ పూర్తికానందున ప్రభుత్వానికి రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. జగన్ నిర్లక్ష్యంతో డ్యామేజ్, రిపేరు పనులకు రూ.4,900 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే ప్రాజెక్టుపై 38 శాతం మేర ఖర్చులు పెరిగాయి. టీడీపీ హయాంలో పోలవరం పనుల్లో అవినీతి జరగలేదని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పార్లమెంట్ లోనే సమాధానం ఇచ్చింది. మా ప్రభుత్వంలో అవినీతి జరిగిందని నిరూపించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. పిచ్చి కుక్క ముద్ర వేసి కుక్కను చంపినట్లు...మంచి ప్రాజెక్టుపై అవినీతి నెపం వేసి విధ్వంసం చేశారు." అని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

"ఐదేళ్లు మేం పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ప్రజలకు వాస్తవాలన్నీ తెలియకుండా దాచి పెట్టారు. కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్, గైడ్ బండ్ తో పాటు అన్ని చోట్లా సమస్యలు సృష్టించారు. ప్రజలంతా అర్థం చేసుకోవాలి...ప్రాజెక్టు సర్వనాశనానికి జగన్ దుస్సాహసమే కారణం. అర్హత లేని వాళ్లకు అధికారం ఇస్తే ఇలానే జరుగుతుంది. కొందరు ఆంబోతుల మాదిరిగా వచ్చి మమ్మల్ని తిట్టొచ్చు...విమర్శలు చేయొచ్చు. కాఫర్ డ్యాంకు, డయాఫ్రం వాల్ కు తేడా తెలియకుండా...ప్రాజెక్టు వద్దకెళ్లి కాఫర్ డ్యాం ఎక్కడుందో వెతుక్కునే వ్యక్తులు విమర్శలు చేస్తున్నారు. కాఫర్ డ్యాం కూడా పర్మినెంట్ కాదు...నీటి డైవర్షన్ కోసమే కాఫర్ డ్యాం నిర్మాణం మూడునాలుగేళ్ల పాటు ఉంటుంది. మొదటి శ్వేతపత్రం రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంపైనే విడుదల చేశాం. ఇది పూర్తైతే పక్క రాష్ట్రాలకు కూడా నీరు ఇవ్వొచ్చు. తెలంగాణకు కూడా సాగర్ కాల్వ ద్వారా నీరందించవచ్చు. రాయలసీమ బాగుండాలంటే నల్లమల అడవి గుండా టన్నెల్ ద్వారా బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరందించవచ్చు. కానీ ఇప్పుడు ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది. కాఫర్ డ్యాం ద్వారా నీరు లీక్ అవుతోంది...దాన్ని పరిష్కరించకుండా పనులు ముందుకు సాగవు. ఇక్కడి ఇంజనీర్లు రిస్క్ తీసుకోవాలన్నా భయపడే పరిస్థితికి వచ్చారు. ప్రాజెక్టులో పైకి తెలిసిన డ్యామేజీ కంటే... తెలియని డ్యామేజీ చాలా ఉంది. 2021లోనే ప్రాజెక్టు దెబ్బతిన్నప్పటికీ 2022లో పూర్తి చేస్తాం, 2023 నాటికి పూర్తి చేస్తాం అని చెప్పారు. డయాఫ్రం వాల్ కు కనీసం రెండు సీజన్ల సమయం పడుతుందని అధికారులు చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి రావడానికి ప్రధాన దోషైన జగన్ ను ప్రజలు ఇంటికి పంపారు. 45.72 మీటర్ల ఎత్తుతోనే నిర్మాణం జరుగుతుంది. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ కూడా అదే ఎత్తులో ఉంటుంది.

"నిర్వాసితుల సమస్యలను చూస్తే బాధేస్తోంది. వర్షాల సమయంలో నీళ్లలో ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి నుండి వెళ్లిపోతే పరిహారం రాదేమోనని భయపడుతున్నారు. పోలవరం ప్రాజెక్టును తలచుకుంటేనే బాధేస్తోంది. అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా...మనమంతా కలిసి పని చేసి సంక్షోభం నుండి ప్రజల్ని, రాష్ట్రాన్ని బయటకు తీసుకురావాలి. పోలవరం ప్రాజెక్టు పట్ల గత ప్రభుత్వం చేసిన దుర్మార్గంతో ఒడిశా, చత్తీస్ గడ్ కూడా కేసులు వేసింది. ప్రాజెక్టును ఆషామాషీగా తీసుకోకూడదు...తేడాలు జరిగితే ప్రమాదం ఏర్పడుతుంది..కానీ గత ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించింది. గతంలో కేంద్రం అనుమతితో ట్రాన్స్ ట్రాయ్ తో చేసుకున్న ధరల ఒప్పందం ప్రకారమే నవయుగకు పనులు అప్పగించాం...కానీ వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పిలిచింది. నేను రివర్స్ టెండరింగ్ నిర్ణయం తీసుకున్నాను...అమలు చేయండి అని మాట్లాడారు. నేను కట్టానన్న అక్కసుతోనే పట్టిసీమను పక్కనబెట్టారు. ప్రజా చైతన్యమే అన్నింటికీ పరిష్కారం అవుతుంది. ప్రజల్లో చైతన్యం లేకపోతే ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని పాలకులు తప్పులు ఎక్కువ చేస్తారు. రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వ్యక్తి జగన్. జగన్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదనే ప్రజలు కూటమికి ఘనవిజయాన్ని ఇచ్చారు. పరదాలు కట్టుకునే ముఖ్యమంత్రికి 936 మంది భద్రతా సిబ్బంది అవసరమా.? నేను బయటకు వెళ్లినా అలవాటులో పోలీసు అధికారులు పరదాలు కడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ట్రాఫిక్ కూడా ఎక్కువ సేపు ఆపొద్దని అధికారులను ఆదేశించాను." అని సీఎం చంద్రబాబు అన్నారు.

## జూలై 1 న ఇంటి వద్దే పంపిణీ.!

**-గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉ.6 నుండి ఫించన్లు పూర్తి అయ్యే వరకూ పంపిణీ చేయాలి.**

**-ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు కేటాయింపు, అవసరం మేరకు ఇతర శాఖల ఉద్యోగులకు పురమాయింపు.**

**-29 వ తేదీ శనివారం నాడే బ్యాంకుల నుండి నగదును డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం కావాలి.**

**-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్.**




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:
ఏపీలో పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన పింఛన్లను జులై 1 నుంచి ఇంటి వద్దే అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు సీఎస్ నీరభకుమార్ జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలిచ్చారు. జులై 1వ తేదీనే (సోమవారం) లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని నిర్దేశించారు.గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చారు. అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగుల సేవలు కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించింది. ఒక్కో ఉద్యోగి 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చూడాలన్నారు. డబ్బులను ఈ నెల 29నే బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.పెరిగిన పింఛన్ల మేరకు 65,18,496 మందికి రూ.4,399.89 కోట్లు పంపిణీ చేయనున్నారు. వీరిలో 64.75 లక్షల మందికి ఇంటి వద్ద రూ.4,369.82 కోట్లు ఇంటి వద్ద అందిస్తారు. మిగిలిన 43 వేల మంది అంటే బయట చదువుకునే దివ్యాంగ్ విద్యార్థులకు రూ.30.05 కోట్లను డీబీటీ ద్వారా వారి అకౌంట్లలోకి జమ చేస్తారు. జులై 1 ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేశారు.

## జగన్ ను గెలిపించిన రెడ్లే.. వైసీపీని ఓడించారా..!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 28:
రెడ్లు అంటే రాజకీయంగా ఎంతో ప్రభావవంతమైన వర్గాలు. వారు ఆధునిక ప్రజాస్వామిక యుగంలో కాకుండా అంతకు ముందు నుంచి కూడా ఆధిపత్య శక్తులుగా ఉన్నారు. రాజ్యాలు ఏలారు.వారు తలచుకుంటే ఎవరిని అయినా అందలం ఎక్కించగలరు, అలాగే దించగలరు. అలాంటి రెడ్లు ఉమ్మడి ఏపీలో కానీ విభజన ఏపీలో కానీ తమ రాజకీయ పలుకుబడిని ఎక్కడా కోల్పోలేదు అన్నది వాస్తవం ఇక ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ తోనే అల్లుకుని పవర్ ఫుల్ పాలిటిక్స్ చేసిన రెడ్లు, విభజన ఏపీలో వైసీపీని అనుసరించారు. ఆ పార్టీ ద్వారా తమ రాజకీయ ఆకాంక్షలను నెరవేర్చుకోవాలని భావించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వారి కోరికలు ఏవీ తీరకపోతే తీరని ఆశాభంగం ఎదురైంది అని అంటున్నారు. వైసీపీకి బ్యాక్ బోన్ గా ఉండే రెడ్లు తాజా ఎన్నికల్లో ఫస్ట్ టైం వైసీపీ మీద రెడ్ సిగ్నల్ చూపించారు అని అంటున్నారు. తమ బలంతో తన స్వేదంతో అధికారంలోకి వచ్చిన జగన్ తమను లైట్ తీసుకోవడం సహించలేకపోయిన రెడ్లు భారీగానే వైసీపీకి దెబ్బ కొట్టారు. ఆ ఫలితమే 11 సీట్లకు వైసీపీని పడదోసి పాతాళం అంచులను చూపించింది అని అంటున్నారు. రాయలసీమలోన్ నాలుగు జిల్లాలలో రెడ్ల ప్రాబల్యం గణనీయంగా ఉంటుంది. 2011లో వైసీపీ ఏర్పాటు చేసిన నాటి నుంచి కొమ్ము కాస్తూ అనేక ఎన్నికల్లో ఆ పార్టీ వెంట నిలిచిన రెడ్లు 2024లో మాత్రం కాడె వదిలేశారు.

దాంతో మొత్తం నాలుగు జిల్లాల్లో 52 అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసీపీకి దక్కినవి సోది లోకి కూడా కాకుండా పోయాయి. అదే విధంగా నెల్లూరు అంటే పెద్దా రెడ్లకు కేరాఫ్ అని చెబుతారు. అలాంటి



చోట వైసీపీ 2014లో మెజారిటీ సీట్లు సాధించింది. 2019లో ఏకంగా క్లీన్ స్వీప్ చేసింది. 2024లో చూస్తే మొత్తానికి మొత్తం సీట్లను టీడీపీ గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసి పారేసింది. ఇక్కడ పదికి పది సీట్లలో రెడ్ల ప్రాబల్యం గణనీయంగా ఉందన్న సంగతి మరవరాదు అంటున్నారు.

ఇక ప్రకాశం జిల్లాలో చూసుకుంటే మొత్తం 12 అసెంబ్లీ సీట్లలో ఎనిమిది నియోజకవర్గాలలో రెడ్ల ప్రాబల్యం ఉంది అని అంటున్నారు. ఇక పల్నాడులో రెడ్ల ప్రాబల్యం నాలుగు జిల్లాలలో గణనీయంగా ఉంది. అదే విధంగా చూస్తే ఈస్ట్ గోదావరి జిల్లాలో రెండు నియోజకవర్గాలలో రెడ్లు శాసిస్తూ ఉంటారు. అలాగే విశాఖలో చూస్తే గాజువాక సీటులో రెడ్ల ప్రాబల్యం ఉంది.

మొత్తంగా చూసుకుంటే రాయలసీమ 52 ప్లస్ నెల్లూరు 10 ప్లస్ ప్రకాశం 8 ప్లస్, పల్నాడులో 4 ప్లస్ ఈస్ట్ గోదావరి 2 ప్లస్ విశాఖ 1 కలులుకుంటే మొత్తం 77 అసెంబ్లీ నియోజకవర్గాలలో రెడ్లు రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్నారు. రాయలసీమలో చూసుకుంటే ఎస్సీ రిజర్వుడు సీట్లలో సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు ఇలా లోకల్ బాడీస్ లో రెడ్లే అధిక శాతం పదవులలో ఉంటారు. ఇంతలా గ్రౌండ్ లెవెల్ వరకూ అధికారాన్ని పంచుకుని సామాజిక వర్గాల పరంగా ప్రభావం చూపిస్తూ అన్నింటా తామే అయిన రెడ్లు ఎందుకు వైసీపీకి ఓటేయించి గెలిపించలేకపోయారు అన్న చర్చ సాగుతోంది.అయితే గత అయిదేళ్లలో వైసీపీ పాలనలో వారు పూర్తిగా అసంతృప్తికి లోను అయ్యారని అంటున్నారు. అది దావానలంగా మారి పెరిగి ఎన్నికల వేళకు చిచ్చు పెట్టింది అని అంటున్నారు. లోకల్ బాడీస్ లో రెడ్లు గెలిచి రాజకీయ అధికారం సంపాదించినా ఖర్చు పెట్టేందుకు పైసా కూడా నిధులు లేవని అంటున్నారు.

వైసీపీ ఏలుబడిలో సర్పంచుల పరిస్థితి ఎంతలా దిగజారింది అంటే వారికి చెక్ పవర్ కూడా ఇవ్వలేదు. వారు బిల్స్ అడుగుతారేమో అని ఇలా చేశారు అంటున్నారు. దీంతోనే వారికి మండిందని అంటున్నారు. ఇక చూస్తే గతసారి వైసీపీ గెలిచిన 151 ఎమ్మెల్యేలలో రెడ్లు 50కి పైగా ఎమ్మెల్యే సీట్లు గెలిచి ఉన్నారు. ఈ నిష్పత్తిలో వారికి కేబినెట్ కూర్పులో కచ్చితంగా ఎనిమిది నుంచి పది పోస్టులు దాకా రావాలి.కానీ సామాజిక న్యాయం అని చెప్పి వారిని పక్కన పెట్టేశారు. జస్ట్ మూడు నాలుగు పోస్టులకే పరిమితం చేశారు. దీనితో వారికి కాలిపోయింది అని అంటున్నారు. అలాగే వారికి నామినేటెడ్ పదవుల విషయంలోనూ అన్యాయం చేశారు అని అంటున్నారు. ఇక కాంట్రాక్టులు ఏమైనా చేసుకోవాలనుకున్నా సర్కార్ నుంచి డబ్బులు విదిలించే పరిస్థితి లేదు. ఇలా రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా దెబ్బ తిన్న రెడ్లు తెగబడి మరీ వైసీపీని కసిగా ఓడించారు అని అంటున్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు.

### -అంగన్వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 28:
గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పిస్తున్న పనులు నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు నీటి యాజమాన్య సంస్థ అధికారులు ఆదేశించారు.
శుక్రవారం పాణ్యం మండలం కౌలూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కెసీ కెనాల్ లో పూడికతీత పనులను పరిశీలించారు.
ఈ సందర్భంగా డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ కౌలురు గ్రామంలో మేజర్ కెనాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. గ్రామంలో 71 మంది కూలీలు పూడికతీత పనులలో పాల్గొన్నారని డ్వామా పిడి కలెక్టర్ కు నివేదించారు. గ్రామంలో 245 జాబ్ కార్డులు ఉండగా 234 మందికి పనులు కల్పించామన్నారు. గత మూడు నెలలుగా కూలీల సరాసరి రేటు 260 రూపాయలు ఉండగా ప్రస్తుత మాసం నందు 280 రూపాయల కూలీలతో పనులు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ కుటుంబాలలో 128 మందికి జాబ్ కార్డులు ఉండగా 106 కుటుంబాలకు పనులు కల్పించామన్నారు. మేజర్ కెనాలలో 3.34 లక్షల నిధులతో ప్రారంభించిన పూడికతీత పనులు జూన్ రెండో వారం నుంచి పనులు చేస్తున్నట్లు కలెక్టర్ కు తెలిపారు. సంబంధిత పనులను కలెక్టర్ పర్యవేక్షిస్తూ నాణ్యంగా రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని సూచించారు. కూలీల సరాసరి రేటు పెరిగేలా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రామచంద్రారెడ్డి, ఎపిడి బాలాజీ నాయక్, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో విజయరాణి ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట పాల్గొన్నారు.
అనంతరం కౌలురు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యవేక్షించారు. కేంద్రంలోని హాజరు అయిన విద్యార్థులు, హాజరు పట్టిని ఇతర రిజిస్టర్లను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. సంపూర్ణ పోషణ అభియాన్ పథకం కింద గర్భిణీ స్త్రీలకు పోషక ఆహార కిట్లు, ఫోలిక్ ఆసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేయాలన్నారు. స్త్రీ సంక్షేమ శాఖ పిడి నిర్మల, నంద్యాల సిడిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 28:
ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని విశ్వనగర్ నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. అలాగే దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రతి గ్రామంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన టైగర్ దోమలు మంచినీటి నిల్వ ఉన్నటువంటి ప్రదేశాలలో చేరి గుడ్లు పెట్టిన అనంతరం లార్వా మరియు పెద్ద దోమగా తయారై కుట్టడం జరుగుతున్న నేపథ్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆశా వర్కర్లు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య అధికారులు, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మలేరియా అధికారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### -డాక్టర్ వెంకట్ రెడ్డి



ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 28:
వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం వర్షాకాలం సందర్భంగా, వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తినే ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం కాపాడుకోడానికి కాచి వడపోసిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పీహెచ్ సీలో సీజనల్ వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్త అవసరమన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కబడిన వెంటనే డాక్టరును సంప్రదించి తగు వైద్యం పొందాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జామియా తుల్ మోమినాత్ అరబిక్ ఉమెన్స్ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




ఆంధ్ర ప్రగతి హైదరాబాదు జూన్ 28:
తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మొఘల్‌పురా లో ఉన్న జామియా తుల్ మోమినాత్ అరబిక్ ఉమెన్స్ యూనివర్సిటీని ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జామియా తుల్ మోమినాత్ అరబిక్ మహిళా విశ్వవిద్యాలయంలో ఫెసిలేటెడ్ మరియు డెలివరీ లెక్చర్‌ను సందర్శించి విద్యార్థులకు ఇస్లామిక్ చదువులతో పాటు ఆధునిక విద్యను నేర్చుకోవాలని సూచించారు. అలాగే మహిళలు అన్ని రంగాలలో రాణించాలని వారి అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడతాయని అన్నారు . గతంలో నేను ఎన్నో పర్యాయములు మంత్రిగా పనిచేసే మైనార్టీ సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేయడం జరిగిందన్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ప్రముఖులు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని సత్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సయ్యద్ షా నూరుల్ హక్ క్వాద్రీ , సీనియర్ జర్నలిస్ట్ ఎంఏ మజీద్ , డైరెక్టర్ మరియు వ్యవస్థాపకుడు జామియా తుల్ మోమినాత్ అరబిక్ మహిళా విశ్వవిద్యాలయం మౌలానా ముఫ్తీ డాక్టర్ హఫీజ్ మహమ్మద్ మస్తాన్ అలీ క్వాద్రీ , ఖతీబ్ ఓ ఇమామ్ మసీద్ ఇ హజ్ హౌస్ నాంపల్లి హఫీజ్ మొహమ్మద్ సాబెర్ పాషా క్వాద్రీ సాహబ్ , శ్రీ మహ్మద్ అహ్మద్ పాషా మరియు ముఫ్తీ అబ్దుర్ రహీం ప్రిన్సిపాల్ జామియా తుల్ మోమినాత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## అడవి జంతువులు సంచారంతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు





ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 28:
మహానంది మండలం గాజులపల్లె గ్రామం అంకిరెడ్డి చెరువు సమీపంలో హెచ్చరిక బోర్డును శుక్రవారం అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం కావడంతో, అడవి జంతువులు తిరుగుతూ ఉంటాయని, వజ్రాలు కోసం పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలోని వంకలో వజ్రాలు వెతికేటప్పుడు, అవి దాడులు చేయడానికి అవకాశాలు ఉన్నాయని,ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. అడవి ప్రాంతంలోకి ప్రవేశం లేదని, ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా మహానందీశ్వరునికి పల్లకి ఉత్సవం



ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 28:
మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకి సేవను ఆలయ వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో పల్లకి సేవ నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## పులి సంచారంతో గోవులకు రక్షణ తెర ఏర్పాటు.



ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 28:
మహానంది క్షేత్రంలోని వెనుక భాగంలో ఉన్న గోశాల పరిసరాల్లో గత పది రోజులుగా చిరుత సంచరిస్తుంది. శుక్రవారం అటవీ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు, మహానంది ఆలయ అధికారులు గోశాల చుట్టూ గోవుల రక్షణ కోసం తెరను ఏర్పాటు చేయడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవుల రక్షణ కోసం, గోవులు చిరుత పులి బారిన పడకుండా రక్షణ తెరను ఏర్పాటు చేశామన్నారు.

## బాచేపల్లి తాండాలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 28:
ఆళ్ళగడ్డ మండలం, బాచేపల్లితాండా లోని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న తితిదే ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, శీల హరిదాస ఠాకూర్ దాస్, ఉపాద్యాయులు తల్లం వెంకటేశ్వర్లు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ముగింపు సందర్భంగా బాచేపల్లి పురోహితులు వెల్లాల రఘునాథ శర్మ వైదిక ధర్మం లోని ఆచారాలను, అందులోని పరమార్థాలను సోదాహరణంగా వివరించి, భక్తులందరితో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహింపచేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి. వీరాంజనేయరావు, పూజారి మూడే గోవింద స్వామి, రాజా నాయక్, నరసింహ నాయక్, వెంకట నాయక్, సేవా నాయక్, బుక్యే ధనకా నాయక్, బుక్యే కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవో చంద్రశేఖర్ రెడ్డి కి ఘనంగా వీడ్కోలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 28:**
మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో ఆయనకు ఆలయ అధికారులు అర్చకులు. నిత్యం మహానంది దేవస్థానం కు కూరగాయలు వితరణ చేస్తున్న మార్కెట్ ప్రసాద్. తదితరులు ఘనంగా సన్మానించి విడ్కోలు పలికారు. వారు మాట్లాడుతూ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి 2022 ఫిబ్రవరి 22న మహానంది దేవస్థానం ఈఓగా బాధ్యతలు తీసుకున్నారని ఆలయ అభివృద్ధికిఎంతో కృషి చేశారని . దేవస్థానంలో ఏళ్ల తరబడివేర్లకు పాతుకుపోయిన అవినీతిని, అనధికార అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి ఆలయ ఆదాయాన్ని అమాంతంగా పెంచారని పలువురు ఆయనను కొనియాడారు .ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు మార్కెట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహానంది దేవస్థానం బాధ్యతలు స్వీకరించిన నూతన ఈవో.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 28:**
మహానంది దేవస్థానం నూతన ఈవోగా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి. ప్రస్తుతం పని చేస్తున్న కాపు చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో శుక్రవారం కోటప్పకొండ దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. బదిలీ అయిన ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతులను ఆలయ అధికారులతో పాటు వేద పండితులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ఉచితంగా కూరగాయలు అందజేస్తున్న దాత మార్కెట్ ప్రసాద్ వేద పండితులు రవిశంకర్ అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ, అర్చకులు, ఉప ప్రధానార్చక కొమ్మది శంకరయ్య ఏ ఈ1 ఓ మధు ఏఈఓ 2 వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

## అక్షర శిఖరం రామోజీ పేరిట జర్నలిస్టులకు అవార్డులివ్వండి.!



**ఆంధ్ర ప్రగతి విజయవాడ, జూన్ 28:**
అక్షర శిఖరం, అక్షర యోధుడు దివంగత చెరుకూరి రామోజీరావు పేరిట వివిధ రంగాలకు చెందిన మీడియా జర్నలిస్టులకు అవార్డులు ప్రకటించాలని సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్ అకాడమీ ఉమ్మడి రాష్ట్ర గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, ఏపీయూడబ్ల్యూజె ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి నిమ్మరాజు చలపతిరావు ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. సరిగ్గా 50ఏళ్ల క్రితం విప్లవాత్మక భావాలతో ఈనాడు పత్రిక ప్రారంభించిన రామోజీరావు వేలాదిమంది యువకులకు శిక్షణ ఇచ్చి జర్నలిస్టులుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. పత్రికా రంగం ద్వారా వివిధ రంగాల్లో ప్రజలకు ఎలా సేవలందించవచ్చో నిరూపించిన మహోన్నత వ్యక్తి అంటూ నిమ్మరాజు కొనియాడారు. ఎల్లవేళలా సమాజహితం కోరుకునే వారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రామోజీరావు సంస్మరణ సభను నిర్వహించడమే కాకుండా ఆయన పేరిట విశాఖలో చిత్రనగరి, అమరావతిలో విజ్ఞాన కేంద్రం, ఒక రహదారికి ఆయన పేరిట నామకరణం చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. నేటి తరం జర్నలిస్టులు ఆయన స్ఫూర్తితో రాణించేందుకు నిష్పక్షపాత రాజకీయ, కళా, వ్యవసాయ రంగాలు, అలాగే ఈనాడు వసుంధర ప్రత్యేక పేజీ స్ఫూర్తితో మహిళా సమస్యల పట్ల పరిశోధనగాత్మక లేదా సమాజ హిత కథనాలు ప్రచురించిన, ప్రసారం చేసిన ఉత్తమ మీడియా జర్నలిస్టులకు ప్రతిఏటా రామోజీరావు పేరిట వర్ధంతి లేదా జయంతి నాడు ఆయన గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వమే అవార్డులు అందజేయాలని ఈమేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి చలపతిరావు లేఖ రాశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# డీఎస్సీ-2024లో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల పోస్టులను చేర్చండి.

**-కాంగ్రెస్ జిల్లా డి.సి.సి అధ్యక్షుడు నరసింహ యాదవ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 28:
ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన డీఎస్సీ-2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పోస్టులను చేర్చాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ డి.సి.సి అధ్యక్షులు నరసింహ యాదవ్ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ..2022, 2024లో 'స్పెషల్' టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను నిర్వహించిన తొలి రాష్ట్రం ఏపీ అయినప్పటికీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా అవసరాలు తీర్చేందుకు , గత ఏడేళ్లుగా ఒక్క ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడిని కూడా నియమించలేదు. గత ఏడాది ఆగస్టులో, పొరుగున ఉన్న తెలంగాణ సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) కేటగిరీలో ప్రాథమిక స్థాయిలో 796 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను, స్కూల్ కేటగిరీలో అప్పర్ ప్రైమరీ/సెకండరీ స్థాయిలో 727 పోస్టుల సృష్టికి అనుమతినిచ్చిందని ఆయన తెలిపారు. సహాయకులు. ఆంధ్ర ప్రదేశ్ లో 1,12,556 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు అవసరమని తెలియజేసారు, ప్రత్యేక డీఎస్సీ కోసం సుమారు 15,000 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని అన్నారు. డీఎస్సీ ద్వారా స్పెషల్ టీచర్లను నియమించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేనప్పుడు ప్రత్యేకంగా బీఈడీ, డీఈడీ కోర్సులను ఎందుకు నిర్వహించిందని ఆయన ప్రశ్నించారు. పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విద్యావేత్తలను నియమించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కరీముల్లా విజ్ఞప్తి చేశారు.

# పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించిన గురుకుల బిసి బాలికల ప్రిన్సిపల్ ను వెంటనే సస్పెండ్ చేయాలి



ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 28:
డోన్ లోని గుత్తి రోడ్డు ప్రభుత్వ హాస్పిటల్ పక్కన రుద్రాక్ష గుట్టలో ఉన్నటువంటి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు తప్పిపోవడం ప్రిన్సిపల్ వసుంధర దేవి మరియు సిబ్బందిదే పూర్తి బాధ్యత అని వారి నిర్లక్ష్యమే కారణమని ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయ్ కుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ డోన్ కేంద్రంగా ఏర్పాటు చేసినటువంటి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలకు చదువుకోడానికి జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది విద్యార్థులు వస్తున్నారని అయితే నిర్మాణం పూర్తి కానటువంటి పాఠశాలలో ప్రహ్రీ గోడ ఉన్నటువంటి దగ్గర ప్రిన్సిపల్ మరియు సిబ్బంది ఎంతో జాగ్రత్తలు వహించవలసి ఉండగా కేవలం వారి స్వలవాల కోసం వారి ఆదాయాలను పెంచుకునే విధంగా ప్రభుత్వం ఇచ్చిన మెరిట్ లిస్ట్ కాకుండా వారికి నచ్చిన విధంగా ప్రిన్సిపల్ కు సహితంగా ఉన్నటువంటి సిబ్బందిచే సీట్లను పక్కదోవ పట్టించి వేలకు వేలు రూపాయలు అమ్ముకుంటూ డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప విద్యార్థుల పట్ల ఏమాత్రం బాధ్యత లేకుండా వహిస్తున్నారని అయితే తప్పిపోయిన పిల్లలను డోన్ సిఐ చొరవతో విద్యార్థులు కర్నూల్ లోని కలెక్టర్ ఆఫీస్ దగ్గర వారిని గుర్తించినట్లు పిల్లలను వెంటనే వారి తల్లిదండ్రులకు అప్పగించారని అయితే మార్గమధ్యలో పిల్లలకు ఏమైనా జరగదని ది జరిగి ఉంటే దాన్ని బాధ్యత ఎవరు వహించే వారిని వారు ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యం వహించినటువంటి ప్రిన్సిపల్ పి వసుంధర దేవిని సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎన్ ఎస్ యు ఐతరపున తెలుగు విజయ్ కుమార్, మధు, అజయ్ ,హర్ష ,సుధీర్, రవి విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు..

# అడవి బిడ్డలకు ఉచిత వైద్య శిబిరాలు బ్యానర్లను ఆవిష్కరించిన రెడ్ క్రాస్ జిల్లా కమిటీ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 28:
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా వారి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర కమిటీ వారు పంపిన మొబైల్ హెల్త్ వ్యాన్ ను జిల్లాలో ఉండే అడవి బిడ్డలకు (ట్రైబల్స్) వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు వినియోగిస్తున్నామని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను మొబైల్ హెల్త్ వ్యాను ముందు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, మండల వైస్ చైర్మన్ సోహెల్, డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ గౌరవ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాలకు జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సహకరిస్తున్నారని అలాగే ఏ ప్రాంతంలో వైద్య శిబిరాలు జరిగినప్పుడు ఆయా ప్రాంతాలలో ఉండే గౌరవ ఐఎంఏ వైద్యుల సేవలను వినియోగించుకుంటామని రేపు ఉదయము 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పె చెరువులో మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు శిబిరానికి కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు సహకరిస్తున్నారని, 30వ తేదీ నుండి జూలై మూడో తేదీ వరకు శ్రీశైలం పరిసర ప్రాంతాలలో శ్రీశైలం సబ్ బ్రాంచ్ చైర్మన్ నాగ శేషు ఆధ్వర్యంలో వైద్య సేవలు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.

# నందికొట్కూరు లో బిజెపి విస్తృతస్థాయి సమావేశం





**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూన్ 28:**
భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా నందికొట్కూరు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మధు అధ్యక్షాన సమావేశ నిర్వహించడం జరిగింది నందికొట్కూరు అసెంబ్లీ ఆరు మండలాల మండల అధ్యక్షులను ఆ మండలాల కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది నందికొట్కూరు పట్టణం. శ్రీకాంత్ యాదవ్. నందికొట్కూరు రూరల్. బి గోపాల్ యాదవ్. పగడాల మండలం. శ్రీధర్ యాదవ్. మిడుతూరు మండలం. ఏం గోపాల్ జూపాడు బంగ్లా మండలం. బి సంజీవరెడ్డి. మండల అధ్యక్షులను జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి మల్లెల కృష్ణారెడ్డి. అల్వాల బాలయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న. రాజారెడ్డి. జిల్లా కార్యదర్శిగూడూరు రవి. రామచంద్రుడు. శివ కృష్ణ యాదవ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రమల బాలముని. కాసేటి చంద్ర. వంటల రమేష్. ఉపేంద్ర నాథ్ రెడ్డి . యువ మోర్చా వెంకటేష్. మద్దిలేటి. నందికొట్కూరు శివారెడ్డి. తదితరులు భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి పాల్గొనడం జరిగింది.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా,వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి.

**-ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 28:
నంద్యాల జిల్లా సిపిఐ ఆఫీస్ నందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా,వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసిన ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా నేతలు
ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ కాకినాడలో జులై 8,9,10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా,వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాల పైన మరియు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదువే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యావ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని అక్రమాలను వెలికితీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థులకు శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల దృష్టిని ఆలోచించి తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను ప్రస్తుతం అధికారంలోకి రావడంతో విద్యార్థుల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 5045 పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన, మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. కాకినాడలో జరుగుతున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, నాయకులు హనుమంతు, తరుణ్, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాలం లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 28:**
వర్షాకాలంలో చిన్న చిన్న జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చును. వర్షాకాలంలో ముఖ్యంగా దోమల బెడద ఎక్కవ. దోమ కాటు వల్ల విషజ్వరాలు వస్తాయి కావున దోమల కాటు నుండి కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు.
విపరీతమైన ఎండల తర్వాత వచ్చే వర్షాకాలం శరీరానికీ, మనసుకీ ఎంతో హాయిగా ఉంటుంది. అయితే వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఇలా సీజన్ ఏదైనా ప్రజల్ని పలు రకాల వ్యాధులు చుట్టుముడుతూనే ఉంటాయి. సహజంగానే సీజన్ మారినప్పుడల్లా సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు,దగ్గు,తుమ్ములు, వాంతులు, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యు, మెదడువాపు లాంటి వ్యాధులు సంభవిస్తాయి. కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి తగు చికిత్సను పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.


పి.మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

**కొన్ని జాగ్రత్తలు:-** ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన చేసిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటినే తీసుకోవాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి.
డయేరియా వ్యాధి బారిన పడిన వారికి రోజుకు వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగించాలి. శుభ్రమైన చోట మాత్రమే మంచినీటిని పెట్టాలి. అలాగే నీటిపై మూత పెట్టడం మరవొద్దు. మంచినీరు ఉంచిన చోట స్నానం చేయడం, బట్టలు ఉతకడం చేయొద్దు. కాయగూరలు, పండ్లను శుభ్రంగా కడగాలి. సాధ్యమైనంత వరకు అప్పుడే వండిన ఆహారాన్ని తీసుకోవాలి. రాత్రి పూట నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా మాంసాన్ని తినొద్దు. భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో కడుక్కోవాలి. అలాగే అలర్జీ కలిగించె లెదర్ వస్తువులకు దూరంగా ఉండండి. వర్షాకాలంలో ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి. విద్యుత్ వైర్లను గమనించి తగు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# పచ్చర్లలో సంచరిస్తున్న చిరుత పులి ఎట్టకేలకు బోనులో..

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ జూన్ 28 :** పచ్చర్ల గ్రామం చెక్ పోస్టు దగ్గర బోనులో చిరుత చిక్కింది. చిరుతను తిరుపతి జూకు తరలించే ఏర్పాట్లు ఫారెస్ట్ అధికారులు చేస్తున్నారు. నెల రోజులుగా పచ్చర్ల పరిసరాల్లో మనషుల పై చిరుత దాడి చేస్తుంది. చిరుతను బంధించడానికి అధికారులు అహర్నిశలు కృషి చేశారు. మేకను ఎరగా వేసి చిరుతను అధికారులు బోనులో బంధించారు. చిరుత పట్టుబడటంతో గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చిరుత వయస్సు 5 నుండి 6 సంవత్సరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చిరుత ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

